# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 17 | శుక్రవారం | 14-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:17 | Friday | 14-8-2026 | Pages:08 | Cost:2/- |







## ఓటుకు నోటు' విచారణ 5కు వాయిదా

**మళ్లీ మొదటి నుంచి వాదనలు విననున్న సుప్రీంకోర్టుం**

న్యూఢిల్లీ: తెలంగాణలో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసు విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబర్ 5కు వాయిదా వేసింది. ఈ కేసులో గతంలో కొంతమేర జరిగిన విచారణను రద్దు చేసి, మళ్లీ మొదటి నుంచి వాదనలు వింటామని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య తదితరులు దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో గురువారం విచారణకు వచ్చాయి.



2లో



## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- నిరవధికంగా వాయిదా పడిన ఉభయ సభలు
- ఈసారి రాజ్యసభ, లోక్‌సభల్లో భారీగా పడిపోయిన ఉత్పాదకత
- దిగువ సభలో 19 శాతం, ఎగువ సభలో 39 శాతం

2లో

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

- 13ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్
- చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్
- బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన




## స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌కిది తొలి విజయం

- సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంతో రాజధాని సాకారానికి శ్రీకారం
- ఐదు కానట?స్పష్టలతో దేశం మెచ్చేలా నిర్మిస్తాం
- 2028లో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం
- గ్రాఫిక్స్ అన్నారు.. మూడు ముక్కలాట ఆడారు
- రైతులు, సింగపూర్ ప్రతినిధులకూ వేధింపులు
- అన్నింటినీ అధిగమించాం.. రాచబాట వేశాం
- రాజధాని కోసం రైతులది త్యాగం కాదు.. స్ఫూర్తి

రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో సీడ్ యాక్సెస్ రోడ్డు మొదటి మెట్టు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉండవల్లి వద్ద అమరావతిని విజయవాడ-మంగళగిరి-గుంటూరులతో అనుసంధానించే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం ప్రారంభించారు. ఈ రహదారిని కలుపుతూ బకింగ్‌హామ్ కాలువపై నిర్మించిన

- మిగతా 2వ పేజీలో






## ప్రజలపై చేతబడులా?

- అవి తిరగబడితే ఫామ్‌హౌస్‌ల్లో అష్టదిగ్బంధనమే
- ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పదేళ్లు అధికారంలో ఉన్నవారు ప్రభుత్వం, ప్రజలపై అఘోరా పూజలు చేయించడం దుర్మార్గం
- రాష్ట్రంలో కరువొచ్చి జనాలు అల్లాడిపోవాలని, ప్రభుత్వం బద్నాం కావాలని చేతబడులు చేశారు
- ఎంత ఘోరమైన పూజలు చేసినా దేవుడు, ఎఅదృష్టం మా వైపే..
- మా సంకల్పం మంచిది కాబట్టే ఎల్‌నినో సమయంలోనూ వర్షాలు
- అత్యంత విలువైన స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్: 'పదేళ్లు అధికారంలో ఉన్న వారు, పాతికేళ్లు తెలంగాణలో రాజకీయం చేసినవారు ప్రభుత్వం, ప్రజలపై పొరుగు రాష్ట్రాలకు వెళ్లి చేతబడులు, అఘోరా పూజలు చేయించడం అత్యంత దుర్మార్గం. బుద్ధి సరిగ్గా లేకపోతే ఆ క్షుద్ర పూజలే తిరగబడతాయి. అదే గనుక జరిగితే మిమ్మల్ని ఫామ్‌హౌస్‌ల నుంచి బయటికి రాకుండా అష్ట దిగ్బంధనం చేస్తాయి..' అని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. గురువారం కూకట్‌పల్లిలో తొలి ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం ఎండిపోవాలని, కరువు వచ్చి జనాలు అల్లాడిపోవాలని, ప్రభుత్వం బద్నాం కావాలని ప్రతిపక్ష నాయకులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి అఘోరా పూజలు, చేతబడులు చేశారు. ఎంత ఘోరమైన పూజలు చేసినా దేవుడు, అదృష్టం మా వైపే ఉన్నాయి. మా సంకల్పం మంచిది కాబట్టే ఎల్ నినో సమయంలోనూ వర్షాలు కురిసి ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్‌లు నిండాయి.

- మిగతా 2వ పేజీలో

## గతంలో కోర్టుకెళ్లిన మీరే.. ఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?

- రాయదుర్గం భూముల వేలం తక్షణమే ఆపాలని సీఎంకు హరీశ్ రావు లేఖ
- అవి వారసత్వ, వివాదాస్పద భూములని లేఖలో స్పష్టీకరణ
- గతంలో ఇదే భూముల కోసం కోర్టుకెక్కిన రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్
- యాజమాన్య హక్కులు తేలకుండా వేలం వేయడంపై తీవ్ర అభ్యంతరం
- ఎస్టీఐ, వక్ఫ్ బోర్డు కేసుల నేపథ్యంలో వేలం నిర్ణయంపై విమర్శలు

2లో





2లో

## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు.

- వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి: పవన్ కల్యాణ్
- ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో పాల్గొన్న పవన్ కల్యాణ్
- దేశంలో ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కి పెరిగిందన్న డిప్యూటీ సీఎం

ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ-ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2వ పేజీలో

## ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు

- కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్
- చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారని ఆరోపణ
- బాధితులే నిందితులుగా మారుతున్నారని, విరూపాక్షి ఘటనే ఉదాహరణ అన్న జగన్
- బీసీ, మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారని విమర్శ
- తాను నాటిన తప్పుడు విత్తనాలే రేపు చంద్రబాబును చుట్టుకుంటాయని హెచ్చరిక

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై

- మిగతా 2వ పేజీలో





## కాళేశ్వరం, యూనిటీ మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాలి

- కాళేశ్వరం అక్రమాలపై డీపీఆర్ నుంచి విచారణ జరిపించాలన్న రఘునందన్ రావు
- కాంగ్రెస్ తప్పులపై కూడా విచారణ జరపాలని డిమాండ్
- ప్రజలను దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ లు పోటీ పడుతున్నాయని విమర్శ

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై కేవలం మూడు బ్యారేజీలకు మాత్రమే పరిమితం కాకుండా, డీపీఆర్ తయారీ నుంచి ముగింపు చెల్లింపుల వరకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్

- మిగతా 2వ పేజీలో

# విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు.

# గతంలో కోర్టుకెళ్లిన మీరే.. ఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని అత్యంత విలువైన రాయదుర్గంలో 10.63 ఎకరాల వారసత్వ భూమి వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేడు ఓ లేఖ రాశారు. ఆగస్టు 17, 21 తేదీల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించ తలపెట్టిన వేలాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ప్రభుత్వ భూములను పూర్వీకులు అందించిన జాతీయ సంపదగా అభివర్ణిస్తూ ఉద్వేగభరిత ప్రసంగాలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక అవే భూములను అమ్మకానికి పెట్టారంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ పరిసరాలు, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను అమ్మేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ భూముల నుంచి రాయదుర్గంలోని వారసత్వ రాతి ప్రదేశాల వరకు తెలంగాణ విలువైన ప్రజా ఆస్తులకు ప్రమాదం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "వేలం వేయాలని ప్రతిపాదించిన రాయదుర్గం పాన్‌మక్తా గ్రామంలోని సర్వే నంబర్ 83ని ఇప్పటికే హెరిటేజ్ సైట్‌గా ప్రకటించారు. దీని యాజమాన్య హక్కులపై ఎస్బీఐ, వక్ఫ్ బోర్డు మధ్య న్యాయవివాదాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి కేసులు పరిష్కారం కానప్పుడు థర్డ్ పార్టీ ప్రయోజనాలు కల్పించవద్దని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది" అని హరీశ్ రావు తన లేఖలో గుర్తుచేశారు.

# ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు..

ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు.

# ఓటుకు నోటు' విచారణ 5కు వాయిదా

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో ఈ కేసు వాదనలు పాక్షికంగా జరిగాయని వారు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ధర్మాసనం స్పందిస్తూ.. గతంలో ఈ కేసు విచారణ చేపట్టిన బెంచ్‌లోని ఒక న్యాయమూర్తి ఇప్పటికే పదవీ విరమణ చేసినందున, కేసును మళ్లీ మొదటి నుంచి విచారించాల్సి ఉందని స్పష్టం చేసింది. తదుపరి వాదనలు వినేందుకు విచారణను సెప్టెంబర్ 5కు వాయిదా వేసింది.

# స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌కిది తొలి విజయం

(మొదటి పేజీ తరువాయి)

స్టీల్ బ్రిడ్జిలను కూడా ఆయన ప్రారంభించారు. దీనికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. స్వర్ణాంధ్ర విజన్‌కు లభించిన తొలి విజయంగా ఈ ఘట్టాన్ని అభివర్ణించారు. తెలుగుజాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం చేపట్టామని, దీనికోసం అప్పట్లో 15 రోజులు అమెరికాలో గడిపానని గుర్తుచేశారు. తనపై నమ్మకంతో సింగపూర్... అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చిందన్నారు. "గత పాలకులు ప్రజలతోపాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయిస్తే.. వాటిని గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజమవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకునే పరిస్థితికి వచ్చారు" అని అన్నారు. రాజధాని కోసం 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి (జగన్‌ను ఉద్దేశించి).. తర్వాత 3రాజధానులంటూ మాట మార్చేశారని మండిపడ్డారు. "మూడు ముక్కలాటకు వ్యతిరేకంగా 2019-24 మధ్య రైతులు చేసిన ఉద్యమాన్ని చరిత్ర మరిచిపోదు. అమరావతితో పాటు రాష్ట్రమంతా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకర నగరంగా తీర్చిదిద్దుతున్నాం" అని తెలిపారు. "అమరావతి రాజధానికి రాజమార్గం అందుబాటులోకి రావడం నగర నిర్మాణ ఘట్టంలో తొలి అడుగు. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్టు అవుతుంది. అమరావతి పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్‌గా తయారుచేస్తున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం, డీప్‌టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతోంది. టాప్ 5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్, అయోధ్య రామాలయ విరాళాల చోరీపై నిరసనలు, నినాదాలు, అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలు, సవాళ్లతో దద్దరిల్లిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయ సభలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈసారి వర్షాకాల సమావేశాలు దాదాపు నిష్ఫలంగా మిగిలిపోయాయి. రాజ్యసభ, లోక్‌సభల్లో ఉత్పాదకత కనిష్ట స్థాయికి పడిపోయింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లులను నిమిషాల వ్యవధిలోనే ఆమోదించడం గమనార్హం. నిత్యం పార్లమెంట్‌లో ప్రతిష్టంభన నెలకొనడం, సభలు పదేపదే వాయిదా పడడం పరిపాటిగా మారింది. ఇందుకు ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని అధికార పక్షం తేలి?చచెప్పింది. అధికార పక్ష వైఖరి వల్లే వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయని ప్రతిపక్ష ఎంపీలు మండిపడ్డారు. ప్రధానమంత్రి గానీ, హోంమంత్రి గానీ ఒక్కసారి కూడా సభా కార్యకలాపాలకు హాజరుకాకపోవడం 'అపూర్వం' అని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ 25 రోజులపాటు సమావేశం కాగా, లోక్‌సభ 19 శాతం పనితీరును నమోదు చేసింది. రాజ్యసభలో అది 39 శాతంగా నమోదైంది. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో 12, రాజ్యసభలో 12 బిల్లులు ఆమోదం పొందాయి. అయితే, కేవలం 'పబ్లిక్ ఎగ్జామినేషన్(అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు--2026'పై మాత్రమే ఉభయ సభల్లోనూ చర్చలు జరిగాయి. ఇతర బిల్లులు పెద్దగా చర్చకు నోచుకోలేదు. పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసనలపై పోలీసుల దమనకాండ, అయోధ్య రామమందిర విరాళాల అపహరణపై ఉభయ సభల్లో తీవ్రస్థాయిలో రగడ జరిగింది. విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రభుత్వం సమాధానం చెప్పాలని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు నిలదీశాయి. ప్రతిపక్షాల నినాదాలు, వాదోపవాదాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉభయ సభల కార్యకలాపాలకు ప్రతిరోజూ అంతరాయం కలిగింది. పార్లమెంట్ భవనం ప్రధాన ద్వారం వద్ద ప్రతిపక్షాలు నిత్యం నిరసన వ్యక్తంచేశాయి. అదే ప్రదేశంలో అధికార ఎన్డీఏ ఎంపీలు కూడా నిరసనకు దిగారు. కనీసం రెండు సందర్భాల్లో ఇరు వర్గాలు ముఖాముఖి తలపడ్డాయి. నీట్ పేపర్ లీక్ విషయంలో విద్యార్థుల నుంచి ఒత్తిడి పెరగడంతో.. పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. లోక్‌సభ నిరవధిక వాయిదా పడిన తర్వాత స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన సాంప్రదాయ తేనీటి విందును కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార?టలు బహిష్కరించాయి. ఈ కార్యక్రమానికి విపక్షాల నుంచి డీఎంకే నాయకురాలు కనిమొళి హాజరయ్యారు. స్పీకర్ చాంబర్‌లో జరిగిన తేనీటి విందులో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర సీనియర్ నాయకులు, మంత్రులు పాల్గొన్నారు. రాజ్యసభలో చైర్మన్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత సోనియా గాంధీతో సహా ప్రతిపక్ష నాయకులు పాల్గొన్నారు. ఈసారి కీలక బిల్లులపై విస్తృత చర్చలు జరగకపోవడంతో ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాల వైఖరిలో మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యసభలో చివరి రోజు జీరో అవర్, ప్రశ్నోత్తరాలను రద్దుచేశారు. గనులు, ఖనిజాల(అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడారు. ఈ సమావేశాల సమయంలో సభా కార్యకలాపాలకు అంతరా యం కలిగిన తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. సభ్యులు ఈ మహోన్నత సభ గౌరవాన్ని నిలబెట్టాలని, భారత ప్రజాస్వామ్య అత్యున్నత సంప్రదాయాలకు అనుగుణంగా తమ పార్లమెంటరీ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు.



# ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు

తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్పైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు.



# కాళేశ్వరం, యూనిటీ మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే లేఖ రాయాలని, తానే స్వయంగా కేంద్ర హోంమంత్రిని కలిసి విచారణ ముందుకు సాగేలా కృషి చేస్తానని తెలిపారు. ఐంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 202 కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమితో చేపట్టనున్న 'యూనిటీ మాల్' ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపైనా విచారణ జరగాలని రఘునందన్ రావు అన్నారు. గతంలో కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిపినప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ తప్పులపైనా దర్యాప్తు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో జరిగిన 10 ఎకరాల భూకేటాయింపుతో పాటు ప్రస్తుత యూనిటీ మాల్ ఒప్పందంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఎకరం భూమి విలువ వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని, అవి కేవలం కస్టోడియన్లుగా మాత్రమే ఉండాలని ఎంపీ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని, అవినీతిలో ఈ రెండూ ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్న అన్నదమ్ముల్లా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం వంటి విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మారుస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించిన ఆయన, ఈ దోపిడీకి ముగింపు పలకాలంటే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు.

# ప్రజలపై చేతబడులా?

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌కు తాగునీటి ఎద్దడి లేకుండా పోయింది. చిత్తశుద్ధి, మంచి ఆలోచన ఉన్న మా ప్రభుత్వాన్ని ప్రజల ఆశీస్సులు, దేవుడి దయ ఎల్లప్పుడూ కాపాడతాయి..' అని సీఎం అన్నారు. 'గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలను ఊరించి, నగరం నుంచి 40--50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొల్లూరు, మేడ్చల్ లాంటి ప్రాంతాల్లో కట్టి ఇబ్బందులకు గురిచేసింది. నగరంలో పనిచేసుకునే పేదలు అర్ధరాత్రి వేళ అంత దూరం వెళ్లి ఎలా జీవిస్తారు? అందుకే కూకట్‌పల్లిలో రూ.వందల కోట్ల విలువైన 11 ఎకరాల స్థలాన్ని కేటాయించి, పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఐటీ కంపెనీల నడుమ, శిల్పారామం పక్కన రూ.1,000 కోట్ల విలువైన 3.5 ఎకరాల స్థలాన్ని 'ఇందిరమ్మ మహిళా శక్తి' స్టాళ్లకు కేటాయించి, మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను, పిండి వంటలను విక్రయించుకునేలా అమెజాన్ లాంటి ఈ--కామర్స్ సంస్థలతో సైతం అనుసంధానం చేశాం. పేదల కోసం నిర్మించే ఇళ్లకు సంబంధించి స్థలాన్ని పూర్తి ఉచితంగా ఇస్తున్నాం. పేదల ఇళ్లకయ్యే రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ లాంటి ప్రాంతాల్లో ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి పనిచేస్తున్న పేదలకు పక్కా ఇళ్లు కట్టించి ఇస్తాం..' అని రేవంత్ చెప్పారు. 'నిషేధిత జాబితా (22 ఏ)ల్లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 22 ఏలో చేరిన భూముల సర్వే నంబర్లకు బై నంబర్లు ఇచ్చి హక్కుదారుల సమస్యలను పరిష్కరిస్తాం. కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలం అంగుళం కూడా ఎక్కడికీ పోదు. కోర్టు కేసులున్న స్థలాల వరకు పక్కనపెట్టి మిగతా వాటికి బై నంబర్లు ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం. భూములు, కట్టుకున్న ఇళ్లు 100% రిజిస్ట్రేషన్ అయ్యేలా చేస్తాం. సోషల్ మీడియాలో అబద్ధాలు ప్రచారం చేసే సంఘాలను, వ్యక్తులను నమ్మొద్దు..' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'గత పాలకులు మాపై రూ.8.11 లక్షల కోట్ల భారీ అప్పుల భారం మోపారు. నడుము వంగిపోయే అప్పుల భారం ఉన్నప్పటికీ, రూపాయి రూపాయి కూడబెట్టి ప్రజా సంక్షేమాన్ని నడిపిస్తున్నాం. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే కోళ్లకు, బర్రెలకు వేసే పరిస్థితి ఉండేది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.25 కోట్ల మంది ప్రజలకు ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నాం. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తున్నాం..' అని సీఎం తెలిపారు. 'మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గం నా రాజకీయ ప్రస్థానంలో కీలక పాత్ర పోషించింది. నాడు నిధులు మంజూరు చేసే అధికారం లేకపోయినా బస్తీల్లో ప్రజలు నా వెన్నంటి నిలిచారు. ఆ రుణాన్ని తీర్చుకునే అవకాశం ఇప్పుడు ముఖ్యమంత్రిగా వచ్చింది. కూకట్‌పల్లి అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదేశాలు ఇచ్చా. నియోజకవర్గంలో రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, పాఠశాలలు, కళాశాలల నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.



# డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

- గ్రీన్‌వుడ్ కాలనీలో జలమండలి అధికారులతో మాజీ కార్పొరేటర్ పర్యటన
- త్వరితగతిన అంచనాలు రూపొందించాలని ఆదేశం



**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌వుడ్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నివారించేందుకు గురువారం ఆయన జలమండలి అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. గతంలోనే డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ, డివిజన్ విభజన కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని ఆయన తెలిపారు. తక్షణమే కొత్తగా అంచనాలు (ఎస్టిమేషన్లు) రూపొందించి పనులను వేగవంతం చేయాలని జలమండలి సిబ్బంది రాజేందర్‌కు సూచించారు. కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గణేష్, స్థానిక నివాసితులు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న' విగ్రహ ఆవిష్కరణకు రావాలి


- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రం అందజేత
- 18న రాజాపేటలో ఆవిష్కరణ మహోత్సవం



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీసీ జాతీయ నాయకులు జైహింద్ గౌడ్, హరిశంకర్ గౌడ్‌లకు కూడా నాయకులు విడివిడిగా ఆహ్వాన పత్రికలు అందించి కార్యక్రమానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగ నరేష్, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్, బొంగోని ఉప్పలయ్య, సత్యనారాయణ, రాజాపేట ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, భీమగాని బాల నరసయ్య పాల్గొన్నారు.

# భారతదేశ నమూనాలో విద్యార్థుల వినూత్న ప్రదర్శన

- రామన్నపేట కృష్ణవేణి పాఠశాలలో ఆకట్టుకున్న వేడుకలు
- విద్యార్థుల్లో వెల్లివిరిసిన దేశభక్తి చైతన్యం



**తొలివెలుగు, రామన్నపేట :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రామన్నపేట మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు వినూత్న రీతిలో దేశభక్తిని చాటుకున్నారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో భారతదేశ పటాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు రూపొందించిన ప్రత్యేక నమూనా ఆకట్టుకుంది. దేశ సమైక్యత, వైవిధ్యంలో ఏకత్వం అనే సందేశాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు నిర్వహించిన ఈ ప్రదర్శన ఉపాధ్యాయులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు సృజనాత్మకతతో రూపొందించిన భారతదేశ నమూనా కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యార్థుల్లో దేశభక్తితో పాటు సామాజిక స్పృహ, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# వైభవంగా అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన





- ధర్మారంలో అలరించిన ఆధ్యాత్మిక శోభ
- హాజరైన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**తొలివెలుగు, అడ్డగూడూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ముత్యాలమ్మ, మారమ్మ, మహంకాళి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలంతా పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేకల మేరీ ఆనంద్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, నాయకులు నిమ్మనగోటి జోజి, బాలెంల విద్యాసాగర్, పాశం సత్యనారాయణ, వల్లంభట్ల రవీందర్, గంగరాజు, పూర్ణ, రమేష్, నరసయ్య, వెంకన్నతో పాటు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.






# సర్కారీ బడికి దాతల చేయూత

- దాతృత్వం చాటుకున్న ఇంద్రియాల సర్పంచ్, ఉప సర్పంచ్
- 150 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లబ్ధి
- ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం: సర్పంచ్ వెంకటేష్ నాయక్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ, విద్యార్థుల వికాసానికి కృషి చేస్తామని ఇంద్రియాల గ్రామ సర్పంచ్ దిరావత్ వెంకటేష్ నాయక్, ఉప సర్పంచ్ రేవల్లి అశోక్ తెలిపారు. మండల పరిధిలోని ఇంద్రియాల జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు సర్పంచ్ తన సొంత నిధులు రూ.65 వేల వ్యయంతో, ప్రాథమిక పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు ఉప సర్పంచ్ రూ.35 వేల వ్యయంతో గురువారం స్పోర్ట్స్ డ్రెస్సులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడిని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా సొంత నిధులతో విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేసి ఆంగ్ల బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు సహకరిస్తే పాఠశాలను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గురునాథం, మాజీ సర్పంచ్ బండి కృష్ణ, వార్డు సభ్యులు ఎర్ర విక్రమ్, మేకల లావణ్య జంగారెడ్డి, మేకల అనిత సుధాకర్, మొగిలిపాక గోపాల్, నాయకులు పెద్దిరెడ్డి యాదగిరి, జగన్, దిరావత్ మహేందర్, ఉపాధ్యాయులు హేమంత్ రెడ్డి, వందన, యూసఫ్, జ్యోత్స్న, శ్రీహరి, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.



# కైలాసపురం ఉత్సవాలకు తరలిరండి

- ఆహ్వాన పత్రికలను అందజేసిన ఆలయ వ్యవస్థాపకులు అంజయ్య స్వామి
- ఈనెల 17న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం, లక్ష కుంకుమార్చన

**తొలివెలుగు, రాజపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం పరిధిలోని కైలాసపురం శ్రీ గౌరీ రేణుక వాసవి బసవలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 17న (సోమవారం) నిర్వహించనున్న ప్రత్యేక ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ వ్యవస్థాపకులు, అర్చక స్వాములు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి కోరారు. గురువారం రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు ఆయన ఉత్సవ ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్య స్వామి మాట్లాడుతూ.. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నాగుల పంచమి బోనాల పండుగ, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దివ్య కల్యాణోత్సవం, గౌరీ రేణుక వాసవి మాతలకు లక్ష కుంకుమార్చన, మహా అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయని తెలిపారు. అలాగే గణపతి పూజ, అఖండ దీపారాధన, నమక చమకాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఉప్పల రమేష్ మాట్లాడుతూ.. కోరిన కోర్కెలు తీర్చే కైలాసపురం అమ్మవార్ల ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మార్త జగదీశ్వర్, బెజుగం నాగభూషణం, ఇమ్మడి నర్సింలు, నంగునూరు రాజు, ఇమ్మడి శ్రీనివాసులు, ఉప్పల శ్రీనివాసులు, బెజుగం శ్రీనివాసులు, గంగిశెట్టి రాజు, పులిగిల్ల శ్రీనివాసులు, నాళ్ళ శేఖర్, పుల్లూరు శ్రీనివాసులు, బుదమ సత్యనారాయణ, సింగారం పెంటయ్య, బెలిదే ఉప్పలయ్య, బెజుగం లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల భూములు వారికే దక్కాలి




- సర్వే నంబర్ 255/1 భూములను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- బాధితులకు న్యాయం జరిగేవరకూ పోరాడతాం

**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్ ముదిరాజ్ కాలనీ సమీపంలో ఉన్న సర్వే నంబర్ 255/1లోని మాదిగల భూములను వారికే కేటాయించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సదరు భూములను గురువారం ఆయన పరిశీలించి, బాధిత రైతులు, భూముల కొనుగోలుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 255/1లో ఉన్న మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమిలో 56 ఎకరాలను రైతులు తమ అవసరాల నిమిత్తం విక్రయించుకున్నారని తెలిపారు. మిగిలిన 18 ఎకరాల్లో కొంత మేర సాగు చేసుకుంటుండగా, మరికొంత భూమిని విక్రయించారన్నారు. ప్రస్తుతం ఈ భూమి ఖాళీగా కనిపించడంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. పేదల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం




చేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగౌని శ్రీధర్‌గౌడ్, నాయకులు మల్లీశ్వరీరెడ్డి, ప్రదీప్, మధు, ఇంద్రకరణ్, మల్లేష్, రైతులు నగేష్, స్కైలాబ్, శ్రీరాములు, శ్యామ్, ప్రవీణ్, గంగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ ఎస్ఐగా శ్రీకాంత్ రెడ్డి

- బాధ్యతల స్వీకరణ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం




**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా (ఎస్ఐ) ఎ. శ్రీకాంత్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. మండలంలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజల సహకారంతో వలిగొండలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠంగా పరిరక్షిస్తామని తెలిపారు.

## 'బడి'లో ఓట్ల పండుగ



- లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో భేష్ అనిపించిన స్కూల్ యూనియన్ పోలింగ్
- ప్రజాస్వామ్యంపై అవగాహనకే ఈ ఎన్నికలు: చెరుకు లింగస్వామి గౌడ్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** విద్యార్థుల్లో పోటీతత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ చెరుకు లింగస్వామి గౌడ్ అన్నారు. భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గురువారం స్కూల్ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. సాధారణ ఎన్నికలను తలపించేలా సాగిన ఈ ఓటింగ్ ప్రక్రియలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఓట్లు వేసి తమ నాయకులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసేందుకే ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళావతి, ఉమా, కుసుమాంజలి, స్పందన, స్వప్న, మేఘమాల, శృతి, లావణ్య, అంజలి, ఐశ్వర్య, రమ్య, శిల్ప పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బొమ్మగోని పరమేష్ గౌడ్
- రూ.5 వేల నగదు అందజేత



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** వంకమామిడి గ్రామానికి చెందిన 7వ వార్డు సభ్యుడు ఎల్లుండి ప్రభాకర్ సతీమణి మాణిక్యేశ్వరి అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొమ్మగోని పరమేష్ గౌడ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తనవంతు సాయంగా బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు వంగాల కిషన్, నాయకులు మచ్చ నరసింహ, సురివి శివ గౌడ్, బడుగ మల్లేశం గౌడ్, మచ్చ యాదగిరి, నరసింహ గౌడ్, దుర్గ, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత 'నీట్' లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 22 వరకు దరఖాస్తుకు అవకాశం
- వెల్లడించిన గురుకుల విద్యా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్

**తొలివెలుగు, రాజపేట :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను అందించే ప్రతిష్టాత్మక 'నీట్' ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. గురువారం ఆయన ఈ వివరాలను వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన బాలురకు హైదరాబాద్‌లోని చిలుకూరు టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫౌండేషన్ సీఓఈలో, బాలికలకు మహేంద్ర హిల్స్ కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

**అర్హతలు, నిబంధనలు:**

విద్యా అర్హత: 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ (బైపీసీ) పూర్తి చేసి, నీట్ (యుజీ)-2026 పరీక్షకు హాజరైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులు అర్హులు. ఆదాయ పరిమితి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థుల ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదు. దరఖాస్తు విధానం: అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన ఫారమ్‌కు నీట్-2026 స్కోర్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఎస్సెస్సీ, ఇంటర్ మార్కుల మెమోలను జత చేయాలి. దరఖాస్తు పంపాల్సిన చిరునామా: ప్రిన్సిపాల్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేసీ (బాలురు), రాజపేట, యాదాద్రి భువనగిరి జిల్లా, పిన్‌కోడ్: 508105. దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేదని, ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# రేణికుంట గ్రామం జిల్లాలకే ఆదర్శం






- ఔషధ వనాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ భాస్కరరావు, డిఆర్డిఓ నాగిరెడ్డి
- విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ.. పంట మార్పిడిపై రైతులకు అవగాహన

**తొలివెలుగు, రాజపేట :** సొంతంగా ఆదాయ వనరులను పెంచుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న రేణికుంట గ్రామ పంచాయతీ జిల్లాలకే ఆదర్శంగా నిలుస్తోందని అదనపు కలెక్టర్ భాస్కరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డిఆర్డిఓ) నాగిరెడ్డి కొనియాడారు. గురువారం రాజపేట మండలం రేణికుంట గ్రామంలో వారు విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని 30 గుంటల స్థలంలో 42 రకాలకు చెందిన 220 ఔషధ మొక్కలతో ఏర్పాటు చేసిన 'ఔషధ వనం'ను వారు ప్రారంభించారు. అనంతరం గొర్రె మల్లేశం, శారద దంపతుల రెండెకరాల పొలంలో మునగ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాజపేట మండలంలో 500 ఎకరాల్లో మునగ సాగును ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి సేద్యం చేసి నష్టపోకుండా పంట మార్పిడి విధానంపై ఏవో పద్మజ, ఏఈవోలు అవగాహన కల్పించడాన్ని అభినందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. గతంలో 10 మంది ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 25కు పెంచిన ఉపాధ్యాయ బృందాన్ని, గ్రామ పాలకవర్గాన్ని ప్రశంసించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రె వెంకటేశం, ఉప సర్పంచ్ బి. హర్షవర్ధన్ రెడ్డి, ఏడీఏ పద్మజ, ఎంపీవో ఆవుల కిషన్, ఏపీఎం బొమ్మ మురహరి, ఎంఈఓ చందా రమేష్, ఇన్చార్జ్ హెచ్ఎం సరిత, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సీసీ వెంకటేష్, ఏఈవోలు ప్రణీత, వినీత, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'మార్నింగ్ వాక్'





- ఇంటింటికీ వెళ్లి అర్హుల వివరాల సేకరణ
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పిలుపుతో రాజపేట మండలంలో కార్యక్రమం

**తొలివెలుగు, రాజపేట :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు అందించడమే లక్ష్యంగా రాజపేట మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు 'మార్నింగ్ వాక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పిలుపు మేరకు గురువారం పుట్టగూడెం, రేణికుంట గ్రామాల్లో ఈ కార్యక్రమం సాగింది. పుట్టగూడెం గ్రామంలో సర్పంచ్ రాంజీ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు ఎందరికి అందుతున్నాయి? ఇంకా అర్హులైన వారు ఎంతమంది ఉన్నారనే విషయమై వివరాలు సేకరించి ప్రత్యేక జాబితా తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ విఠల్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ మాన్య నాయక్, వార్డు సభ్యుడు భీమానాయక్, చందు నాయక్, రమేష్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, కారోబార్ వసంత పాల్గొన్నారు. అలాగే రేణికుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు బొద్దుల నగేష్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ కోరే మల్లయ్య, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఛైర్మన్ పోసుగొండ మధు, నాగపురి భాస్కర్, వార్డు సభ్యులు గొర్రె మల్లయ్య, రాంగళ్ళ కృష్ణ, రాంగళ్ళ బాలరాజు, బొద్దుల ఆదినారాయణ, సట్టు బిక్షపతి, కోరే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. నిండిన చిన్నారి ప్రాణం

- పాఠశాలలో విరిగిపడిన వేపచెట్టు.. పంద్రాగస్టు క్రీడల్లో విషాదం
- మూడో తరగతి విద్యార్థిని హలీమా దుర్మరణం
- మరో నలుగురికి తీవ్ర గాయాలు.. భువనగిరి ఆస్పత్రిలో చికిత్స

**తొలివెలుగు, భువనగిరి:** పాఠశాల ప్రాంగణంలో పంద్రాగస్టు వేడుకల సందర్భంగా క్రీడలు ఆడుతున్న విద్యార్థులపై పాత వేపచెట్టు విరిగిపడటంతో ఓ చిన్నారి మృతి చెందగా, మరో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషాద ఘటన గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భువనగిరి పట్టణ పరిధిలోని భగాయత్ ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో విద్యార్థులు మైదానంలో క్రీడలు ఆడుతున్నారు. ఈ క్రమంలో మైదానంలో ఉన్న పాత వేపచెట్టు ఒక్కసారిగా విద్యార్థులపై విరిగిపడింది. ప్రమాదాన్ని గమనించిన ఉపాధ్యాయులు, స్థానికులు వెంటనే స్పందించి చెట్టు కొమ్మలను తొలగించి, కింద చిక్కుకున్న ఐదుగురు విద్యార్థులను బయటకు తీశారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అయితే మూడో తరగతి చదువుతున్న హలీమా (8) చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో విద్యార్థి కాలుకు తీవ్ర గాయమైందని, మిగిలిన విద్యార్థులకు కూడా గాయాలయ్యాయని సమాచారం. ప్రస్తుతం బాధిత విద్యార్థులకు ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకర స్థితిలో ఉన్న పాత చెట్లను ముందుగానే గుర్తించి తొలగించకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే చిన్నారి ప్రాణాన్ని బలిగొన్నదని ఆరోపిస్తూ, పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లను వెంటనే తొలగించి విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





## విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ
- ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ

**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఏకరూప దుస్తులను ఏపీఎం యాదయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలను కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆయన సూచించారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫక్కీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు సామిడి సంధ్య, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, జంగం వెంకటమ్మ, సీసీ మామిళ్ల నర్సింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గూడూరు సునీత, వీఓఏలు సంతోష, మౌనిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 18న ఎమ్మార్పీఎస్ మండల సదస్సు

- చౌటుప్పల్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహణ
- హాజరుకానున్న జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్



**తొలివెలుగు, చౌటుప్పల్ :** ఈ నెల 18వ తేదీన చౌటుప్పల్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భవనంలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల ఎమ్మార్పీఎస్ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రెండు మండలాల ఇన్చార్జి బోయ లింగస్వామి మాదిగ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు సంబంధించి ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీల అధ్యక్షులను నియమించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కావున చౌటుప్పల్, నారాయణపురం మండలాల పరిధిలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# వ్యాధుల సీజన్.. దోమల బెడద

- వర్షాకాలం వేళ పెరుగుతున్న దోమల ఉధృతి
- ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్
- ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: మగ్గిడి జయ
- సాయంత్రమైతే ఇళ్లలోకి దోమల దండు: మూల భాస్కర్‌గౌడ్




**తొలివెలుగు, జన్నారం:** వర్షాకాలం నేపథ్యంలో జన్నారం మండలం పోనకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. పలు వార్డుల్లో మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు నెలకొనడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయ్యిందంటే చాలు పెద్ద సంఖ్యలో దోమలు ఇళ్లలోకి చేరుతుండటంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

**ముందస్తు చర్యలు అవసరం:**


ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం అవసరమని పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ నిర్వహించడంతో పాటు దోమల నివారణ మందు పిచికారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామంలో సమగ్ర పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించి దోమల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### సర్పంచ్ స్పందించాలి: మగ్గిడి జయ



గ్రామంలో తీవ్రంగా ఉన్న దోమల సమస్యపై గ్రామ సర్పంచ్ వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా సీపీఎం పార్టీ ఉపాధ్యక్షురాలు మగ్గిడి జయ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దోమల ద్వారా వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున మురుగు కాలువల శుభ్రత, దోమల నివారణ మందు పిచికారీ, ఫాగింగ్ వంటి చర్యలను వెంటనే చేపట్టాలని ఆమె సూచించారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సాయంత్రమైతే దోమల దండు: మూల భాస్కర్‌గౌడ్



గ్రామంలో దోమల సమస్య తీవ్రంగా ఉందని స్థానికుడు మూల భాస్కర్‌గౌడ్ తెలిపారు. సాయంత్రం అయ్యిందంటే పెద్ద సంఖ్యలో దోమలు ఇళ్లలోకి చేరుతున్నాయని, దీంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దోమల బెడద పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల ద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తమై వెంటనే ఫాగింగ్, మందుల పిచికారీ చేపట్టాలని కోరారు. ప్రతి వార్డులో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి, దోమల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## జనవాసాల మధ్య 'డంపింగ్ యార్డ్' వద్దు

- అంకిరెడ్డిగూడెం పరిధిలోని సర్వే నం. 326లో పనులు వెంటనే నిలిపివేయాలి
- ఆర్డీఓ, తహసీల్దార్లకు వినతిపత్రం అందజేసిన సర్పంచ్, గ్రామస్థులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** జనవాసాలు, పాఠశాలలకు సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని అంకిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చెత్తను సేకరించి నిల్వ చేసేందుకు గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ మేరకు గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి చౌటుప్పల్ ఆర్డీఓ వి. శేఖర్ రెడ్డి, తహసీల్దార్ వీరాబాయి, ఎంపీడీఓ కె. శ్రీలతలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. లింగోజిగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 326లో స్మశానవాటిక పక్కన, కాంశెట్టి పెంటయ్య బావి నుంచి బిస్కెట్ల కంపెనీ వెనుక భాగం వరకు ఉన్న స్థలంలో చెత్త నిల్వ కేంద్రం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్రతిపాదిత స్థలానికి సమీపంలో జనవాసాలతో పాటు పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే చెత్త నుంచి వెలువడే దుర్వాసన, అపరిశుభ్రత కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే నిర్మాణ పనులను నిలిపివేసి, గ్రామానికి, పాఠశాలలకు కనీసం రెండు కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్ల అండాలు శేట్టయ్య గౌడ్, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, పర్నే శ్రీధర్ రెడ్డి, భీమగోని మల్లేశం గౌడ్, గంగాపురం పాండు గౌడ్, పంచాయతీ కార్యదర్శి శివాజీ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల భద్రతకే 'పోక్సో' చట్టం!

- అత్యవసర పరిస్థితుల్లో '1098'కు ఫోన్ చేయాలి
- నేలపట్ల జెడ్పీహెచ్ఎస్‌లో 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్', 'పోక్సో'పై అవగాహన




**తొలివెలుగు, చౌటుప్పల్:** చిన్నారుల భద్రత, హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చౌటుప్పల్ మండలం నేలపట్ల జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ), 'స్కోప్' స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్', పోక్సో చట్టం, బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీయూ సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు, శిక్షలు ఉంటాయని తెలిపారు. ప్రతి విద్యార్థి సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శ మధ్య తేడాను తెలుసుకోవాలని సూచించారు. తమకు ఎదురయ్యే అనుమానాస్పద పరిస్థితులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించి, టోల్‌ఫ్రీ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ బాబు, 'స్కోప్' ప్రతినిధి బి. నరసింహ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు





# స్వర్ణగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీవారి 'తిరుప్పావడ' సేవ

- అంగరంగ వైభవంగా నిత్య కల్యాణోత్సవం, తిరువీధి సేవ
- శ్రావణ మాసం వేళ విద్యుత్ కాంతుల్లో శోభాయమానం

**తొలివెలుగు, భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం శ్రావణ మాస పూజలు, విశేష సేవలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, భక్తులకు గోపృష్ఠ దర్శనం కల్పించారు. బంగారు బావి నుండి సువర్ణ బిందె తీర్థాన్ని తీసుకువచ్చి స్వామివారికి నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని స్వర్ణాభరణాలు, పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్రనామార్చన జరిపారు.

**ఘనంగా 'అన్నకూటోత్సవం':**

సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండాలనే సంకల్పంతో శ్రీవారికి ప్రతి గురువారం నిర్వహించే 'తిరుప్పావడ' (అన్నకూటోత్సవం) సేవను వేదమంత్రోచ్ఛారణల మధ్య జరిపారు. ఈ సందర్భంగా సుమారు 450 కిలోల అన్నప్రసాదం, లడ్డు, వడ తదితర పిండివంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.



శ్రావణ మాస శుభవేళ శ్రీ పద్మావతి అమ్మవారికి నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం, అష్టలక్ష్మి మంటపంలో మహాలక్ష్మి హవనం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు శ్రీవారి వైభవోత్సవ మంటపంలో పట్టు పీతాంబరాల అలంకరణలో స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. సాయంత్రం



స్వామివారిని మాడవీధుల్లో శోభాయమానంగా ఊరేగిస్తూ తిరువీధి ఉత్సవం జరిపారు. అనంతరం సహస్రదీప కాంతుల మధ్య ఊయల సేవ, పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. కాగా, క్షేత్రంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నప్రసాద వితరణలో గురువారం సుమారు 3,000 మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.






## మహిళలు, చిన్నారుల భద్రతకే తొలి ప్రాధాన్యం

- మల్కాపురం ఐటీ పార్క్‌లో అవగాహన సదస్సు
- భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలి: చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్:** మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించేందుకు చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం ఐటీ పార్క్‌లోని 'తెలుగు పచ్చళ్ళు' కంపెనీ ప్రాంగణంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న వివిధ రకాల వేధింపులు, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులను సంప్రదించే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ.. ఆపద సమయంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించేందుకు పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎలాంటి సమస్యలు, వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చేందుకు సంకోచించాల్సిన అవసరం లేదని, చట్టపరంగా అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీడీఈడబ్ల్యూ కమిటీ సభ్యులు, స్థానిక పోలీస్ సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పిల్లలే భావి భారత పౌరులు: బోరం ప్రకాశ్ రెడ్డి

- తూర్పుగూడెం, మందోల్లగూడెం బడుల్లో 36 మంది చిన్నారులకు పంపిణీ
- దాతృత్వం చాటుకున్న టీఆర్ఎస్ నాయకుడు బోరం ప్రకాశ్ రెడ్డి


**తొలివెలుగు, చౌటుప్పల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు



సహకారం అందించడం అభినందనీయమని మందోల్లగూడెం మాజీ ఉప సర్పంచ్, టీఆర్ఎస్ నాయకుడు బోరం ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన తూర్పుగూడెం ప్రాథమిక పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు, మందోల్లగూడెం ప్రాథమిక పాఠశాలలోని 11 మంది విద్యార్థులకు ఉచితంగా షూలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి చిన్నారులే రేపటి భావి భారత పౌరులని, వారు క్రమశిక్షణతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువులో రాణించేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని కోరారు. బడుల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. నూతన షూలు అందుకున్న చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పుగూడెం ఏఏపీసీ చైర్మన్ పిట్టల సంతోష, వార్డు సభ్యులు మానే రవి కుమార్, గుండు శ్రీశైలం, తూర్పుగూడెం బడి హెచ్ఎం ఎస్. పరమేష్, ఉపాధ్యాయురాలు జి. వరలక్ష్మి, మందోల్లగూడెం హెచ్ఎం ఎన్. సంధ్య, నాయకులు గుండు ప్రశాంత్, నిలిగొండ రఘు తదితరులు పాల్గొన్నారు.

# 'పంచధారల' వారసత్వ సంపదకు ముప్పు.. కేంద్రం జోక్యం చేసుకోవాలి: రాజ్యసభలో వైవీ సుబ్బారెడ్డి

- రాజ్యసభలో పంచధారల మైనింగ్ అంశాన్ని లేవనెత్తిన వైవీ సుబ్బారెడ్డి
- వారసత్వ కట్టడాల పరిరక్షణకు మైనింగ్ తక్షణం ఆపాలని డిమాండ్
- కేంద్ర మంత్రులను కలిసి ఫిర్యాదు చేసిన వైసీపీ ఎంపీలు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణకు అభ్యర్థన
- 10 రోజుల్లోగా కేంద్ర బృందం పరిశీలిస్తుందని కేంద్ర మంత్రుల హామీ



ఆంధ్రప్రదేశ్‌లోని పంచధారల వారసత్వ ప్రాంతం సమీపంలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వైసీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై పార్టీ సీనియర్ నేత, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం రాజ్యసభలో గళం విప్పారు. ప్రాచీన బౌద్ధ స్థూపాలు, ఆలయాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మినరల్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పంచధారలలోని బౌద్ధ క్షేత్రం, పురాతన ధర్మలింగేశ్వర స్వామి ఆలయానికి అతి సమీపంలో మైనింగ్ జరుగుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణం గుండా ప్రవహించే ఐదు సహజ నీటి ప్రవాహాల వల్లే ఆ ప్రాంతానికి 'పంచధారల' అని పేరు వచ్చిందని, ప్రస్తుత మైనింగ్ కార్యకలాపాలతో ఆ పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వెంటనే తనిఖీలు చేపట్టాలని, పర్యావరణ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేయాలని, అన్ని అనుమతులను పునఃపరిశీలించాలని కోరారు. ఈ అధ్యయనాలు పూర్తయ్యే వరకు మైనింగ్‌ను నిలిపివేయాలని ఆయన స్పష్టం చేశారు. ఖనిజ సంపద ప్రజలదని, దాని నిర్వహణలో పారదర్శకత ఉండాలని సుబ్బారెడ్డి అన్నారు. మైనింగ్ విధానాలను రూపొందించేటప్పుడు రాష్ట్రాల ఆదాయానికి, స్థానిక ప్రజల జీవనోపాధికి, పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తుచేశారు. అంతకుముందు, ఇదే అంశంపై వైసీపీ ఎంపీలు గొల్ల బాబూరావు, గుమ్మ తనూజారాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితరులు ఢిల్లీలో కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మైనింగ్, బ్లాస్టింగ్ వల్ల పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని అధికారిక విచారణలో తేలినట్లు వారు మంత్రులకు వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రులు.. పది రోజుల్లోగా ఒక కేంద్ర బృందాన్ని పంపి మైనింగ్ కార్యకలాపాలను పరిశీలిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ తనూజారాణి తెలిపారు. ఈ వ్యవహారంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తే సరిపోదని, అక్రమ తవ్వకాలకు నిబంధనల ప్రకారం సుమారు రూ. 250 కోట్ల జరిమానా విధించాల్సి ఉందని పేర్కొన్నారు. సీఎం రమేశ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన కోరారు.

# పోలీసులతో కూడా చంద్రబాబు భజన చేయించుకుంటున్నారు

- ఎస్పీలు, సీఐలతో ముఖ్యమంత్రి నేరుగా సమీక్షలు చేయడం సరికాదన్న పేర్ని నాని
- స్థానిక ఎన్నికల్లో పోలీసులను అడ్డగోలుగా వాడుకునేందుకే ఈ సమీక్షలు అని ఆరోపణ
- ప్రియాంక హత్యపై పవన్ ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్న



సొంత పార్టీ నేతల భజనతో వచ్చే కిక్ సరిపోక, ఇప్పుడు సీఎం చంద్రబాబు ఏకంగా ఖాకీ దుస్తుల్లో ఉన్న పోలీసులతోనూ తనను తాను పొగిడించుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నాని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయి సీఐలు, ఎస్పీలతో ముఖ్యమంత్రే నేరుగా సమీక్షలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. డీజీపీ అసమర్థుడు కావడం వల్లే చంద్రబాబు రంగంలోకి దిగారా అని ప్రశ్నించారు. రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులను అడ్డగోలుగా వాడుకునేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సీఎం ధైర్యసాహసాలను కొందరు అధికారులు కొనియాడటాన్ని నిలదీస్తూ... నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని, పదవులను లాక్కోవడమే చంద్రబాబు చూపిన ధైర్యమా అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడుతూ, డాక్టర్ ప్రియాంకను కారుతో తొక్కి చంపిన దారుణ ఘటనను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలను కేవలం ప్రమాదాలుగా చిత్రీకరిస్తూ కొందరు పోలీసుల తీరుతో ఖాకీ దుస్తుల పరువు పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ గురించి మాట్లాడే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రియాంక దారుణ హత్యపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణం పేరుతో ఛానళ్లకు భారీగా డబ్బులు ఇస్తూ ప్రచార ఆర్భాటాలకు దిగుతున్నారని, ఎమ్మెల్యే క్వార్టర్లను గొప్పగా చూపుతున్న ప్రభుత్వం... రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎంతమంది ఎమ్మెల్యేలను అందులో ఉంచుతుందో చూద్దామని సెటైర్లు వేశారు. ప్రభుత్వానికి రైతుల భూములు కావాలి కానీ వారి కష్టాలు పట్టడం లేదని, వెంటనే కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా చేసిన ఆరోపణలపైనా పేర్ని నాని ఘాటుగా స్పందించారు. తనపై, తన భార్యపై రూ. 50 కోట్ల ఆరోపణలు చేస్తున్నారని, తాము ఎవరి ఇంటికి వెళ్లామో నిరూపించేలా సీసీటీవీ ఫుటేజీ, ఆధారాలను బయటపెట్టాలని సవాల్ విసిరారు. తాము రూ. 50 కోట్లు ఇచ్చి ఉంటే తమను, ఒకవేళ ఆ డబ్బు చంద్రబాబు తీసుకుని ఉంటే ఆయన్ను జైలులో వేయాలని వ్యాఖ్యానించారు.

# రాజమండ్రి సమీపంలో భారీగా గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.4.29 లక్షలు పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీలేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి విజయవాడకు కారులో అక్రమంగా తరలిస్తున్న 25.970 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక కారును ఆపి సోదా చేయగా, మూడు పాలిథిన్ సంచుల్లో నిల్వ చేసిన గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4.29 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులను ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన దులపల్లి సుజీవ్ కుమార్, మొదుగు నరేష్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి ఒక కారు, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని విజయవాడకు చెందిన చినంశెట్టి రాజేష్ అనే వ్యక్తికి చేరవేసేందుకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# దేవాదాయ శాఖ పరిధిలోకి 'సరళమైసమ్మ' ఆలయం

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ఆలయ ఆస్తులు, ఆదాయాన్ని క్రమబద్ధీకరించాలని డిమాండ్
- అధికారుల నిర్లక్ష్యంతో ఆలయ అభివృద్ధి కుంటుపడుతోంది: తగరం సుభాష్ చంద్రబోస్

**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ రెవెన్యూ పరిధిలోని, చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామ నిర్వహణలో ఉన్న ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ సరళమైసమ్మ దేవాలయాన్ని దేవాదాయ (ఎండోమెంట్) శాఖ పరిధిలోకి తీసుకురావాలని గురువారం బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరళమైసమ్మ ఆలయానికి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నప్పటికీ ఆలయ నిర్వహణ, అభివృద్ధిపై సంబంధిత అధికారులు తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఆలయాన్ని దేవాదాయ శాఖ



ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన ఆస్తులు, ఆదాయం, నిర్వహణ తదితర అంశాలను క్రమబద్ధీకరించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

**వెంటనే ప్రక్రియ ప్రారంభించాలి:**

సరళమైసమ్మ దేవాలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకునే ప్రక్రియను వెంటనే ప్రారంభించి, ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ, జిల్లా అధికారులను సుభాష్ చంద్రబోస్ కోరారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అభివృద్ధి పేరుతో పర్యావరణానికి నష్టం కలిగించడం సరికాదని ఆయన అన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు ప్రకృతి పరిరక్షణ, ప్రజల ప్రయోజనాలను కాపాడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి మాధ రమేష్, చౌటుప్పల్ మండల నాయకులు సుక్క రాములు, మల్కాపూర్ సెక్టార్ అధ్యక్షుడు గుడ్డేటి దశరథ్, నర్సింహ, తరుణ్‌చారి, సాయితేజ, ప్రశాంత్ పాల్గొన్నారు.



# పసిడి, వెండి రివర్స్‌గేర్

న్యూఢిల్లీ: అమెరికా--ఇరాన్ మధ్య యుద్ధానికి రెండు వారాల విరామంపై అంగీకారంతో ర్యాలీ చేసిన పసిడి, వెండి ఒక్క రోజు తిరగకుండానే గురువారం అమ్మకాల ఒత్తిడికి నష్టపోయాయి. కాల్పుల విరమణకు విరుద్ధంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసిందంటూ, ఒప్పందం నుంచి తప్పుకుంటామని ఇరాన్ చేసిన హెచ్చరికలు, హర్మూజ్‌ను మూసేసిందన్న వార్తలతో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. ఈ ప్రభావంతో ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి ఏకంగా రూ.7,800 నష్టపోయి రూ.2.43 లక్షలకు దిగొచి?చంది. అటు బంగారం 10 గ్రాములకు రూ.1,500 తగ్గి రూ.1,54,900 స్థాయికి పరిమితమైంది. 'పశి?చమాసియాలో కాల్పుల విరమణపై ఏర్పడ్డ సందేహాలతో బంగారం, వెండి ముందటి రోజు లాభపడిన స్థాయిలో నష్టపోయాయి. హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంపై అనిశి?చతులు నెలకొనడం, ట్యాంకర్లు నిలిచిపోయాయన్న సమాచారం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించింది.దీంతో ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న ఆందోళనలు తిరిగి నెలకొన్నాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 12 డాలర్లు పెరిగి 4,789 డాలర్ల వద్ద ఉంటే, వెండి 0.74 డాలర్ల నష్టంతో 74.83 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

## ఒక వైపు 30వేల లేఆఫ్స్..
## మరోవైపు రూ.270 కోట్ల ఆఫర్!



ప్రముఖ టెక్ దిగ్గజం 'ఒరాకిల్' ఇటీవల ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించి వార్తల్లో నిలిచింది. ఇలాంటి సమయంలో కంపెనీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (జఖీూ)గా హిలరీ మ్యాక్సన్‌ను భారీ వేతనంతో నియమించింది. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం సర్వత్రా చర్చకు దారితీసింది. ఒరాకిల్ కొత్త సీఎఫ్ఓ హిలరీ మ్యాక్సన్‌కు కంపెనీ 9,50,000 డాలర్ల జీతం ఇవ్వనుంది. అదనంగా పనితీరు ఆధారంగా 2.5 మిలియన్ డాలర్ల వరకు బోనస్ పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా 26 మిలియన్ డాలర్ల విలువైన ఈక్విటీ (షేర్లు) కూడా సంస్థ అందిస్తుంది. వీటిలో 80 శాతం సమయానికి అనుసంధానమైనవి కాగా, 20 శాతం పనితీరుపై ఆధారపడి ఉంటాయి.మ్యాక్సన్ తన ఈక్విటీని పూర్తిగా స్టాక్ ఆప్షన్ల రూపంలో లేదా స్టాక్ ఆప్షన్లు, రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్ల రూపంలో తీసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా కంపెనీ ఆమెకు 2,50,000 విలువైన రీలోకేషన్ అలవెన్స్ కూడా అందిస్తోంది. ఇవన్నీ కలిగి ఆమె మొత్తం ప్యాకేజీ సుమారు 29.7 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.273 కోట్లు) చేరుకుంటుంది.హిలరీ మ్యాక్సన్ ఒరాకిల్‌లో చేరడానికి ముందు.. ష్నైడర్ ఎలక్ట్రిక్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఎఫ్ఓగా పనిచేశారు. అంతే కాకుండా ఆమె ఏఈఎస్ కార్పొరేషన్‌లో 12 సంవత్సరాలు పాటు ఫైనాన్స్, స్ట్రాటజీ మొదలైన విభాగాల్లో పాటు కీలక బాధ్యతలు నిర్వహించారు.

**కంపెనీ భారీ లేఆఫ్స్**

ఇటీవల ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ భారీ లేఆఫ్ ప్రభావం భారతదేశంలో సుమారు 12,000 మంది ఉద్యోగులపై పడింది. కంపెనీ ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం.. కంపెనీ నిర్మాణ మార్పులు, ఖర్చు తగ్గింపు చర్యలు, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అని తెలుస్తోంది. ఈ కోతలు ఒరాకిల్ హెల్త్, సేల్స్, క్లౌడ్, కస్టమర్ సక్సెస్, నెట్‌సూట్‌లోని సిబ్బందిని ప్రభావితం చేసినట్లు సమాచారం.


## డిస్నీలో లేఆఫ్స్?

### 1,000 మంది ఉద్యోగులపై వేటు

ప్రపంచ వినోద రంగ దిగ్గజం 'వాల్ట్ డిస్నీ' తన ఖర్చులను తగ్గించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా రాబోయే కొద్ది వారాల్లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించాలని కంపెనీ యోచిస్తోంది. ప్రధానంగా కంపెనీలోని మార్కెటింగ్ విభాగంపై ఈ ప్రభావం అధికంగా ఉండనుందని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.డిస్నీలో జరుగుతున్న ఈ తాజా పరిణామాలు సంస్థ అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగమని తెలుస్తోంది. కొత్తగా నియమితులైన చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (సీఎంఓ) అసద్ అయాజ్ కంపెనీ మార్కెటింగ్ గ్రూపును ఏకీకృతం చేసే పనిలో ఉన్నారు. 'ప్రాజెక్ట్ ఇమాజిన్' అనే రహస్య కోడ్ పేరుతో వ్యయ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. జనవరిలో బాధ్యతలు చేపట్టిన అయాజ్ సంస్థలోని అన్ని మార్కెటింగ్ కార్యకలాపాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని భావిస్తున్నారు.కొత్త చేపట్టబోయే లేఆఫ్స్ డిస్నీ మొత్తం శ్రామిక శక్తిలో 1 శాతం కంటే తక్కువే. 2025 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి డిస్నీలో సుమారు 2,31,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జోష్ డి అమారో డిస్నీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు స్వీకరించక ముందే ఈ ఉద్యోగాల తగ్గింపు ప్రణాళికలు సిద్ధమైనట్లు సమాచారం.

# వాణిజ్యలోటు కలవరం.. జూలై నెలలో 31.98 బిలియన్ డాలర్లు

**ఆరు నెలల గరిష్ఠానికి చేరుకున్న లోటు**




న్యూఢిల్లీ, ఆగస్టు 13 : దేశీయ ఎగుమతులు భారీగా పుంజుకుంటున్నాయి. గత నెలలో 44.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అయిన ఎగుమతులతో పోలిస్తే 19.6 శాతం చొప్పున పెరిగాయి. ఇదే సమయంలో భారత్ 76.22 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 17.52 శాతం అధికమయ్యాయి. దీంతో వాణిజ్యలోటు (ఎగుమతులు-దిగుమతుల మధ్య వ్యత్యాసం) ఆరు నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. గత నెలలో వాణిజ్యలోటు 31.98 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. పెట్రోలియం ఉత్పత్తులు అధికంగా దిగుమతి చేసుకోవడం వల్లనే వాణిజ్యలోటు పెరిగిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఒక జూలై నెలలోనే 18.31 బిలియన్ డాలర్ల విలువైన క్రూడాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకున్నది. కిందటేడాదితో పోలిస్తే ఇది 17.64 శాతం అధికం. అతి విలువైన లోహాల దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో వీటి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో పసిడి దిగుమతులు కేవలం 4.77 శాతం పెరిగి 4.16 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 66 శాతం తగ్గి 171.68 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మే 13 నుంచి అమల్లోకి వచ్చేలా ఈ రెండు లోహాలపై సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు గోల్డ్ దిగుమతులు 32.41 శాతం ఎగబాకి 15.17 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 50.81 శాతం తగ్గి 718.42 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దేశంలోకి వస్తున్న బంగారంలో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి అవుతున్నదని, అలాగే యూఏఈ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి 10 శాతం చొప్పున వస్తున్నది. జూలై నెలలో స్విట్జర్లాండ్ నుంచి 2 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతి అయింది. చైనా తర్వాత అత్యధికంగా బంగారం వినియోగిస్తున్న భారత్‌లో ఆభరణాలకు ఎనలేని డిమాండ్ ఉన్నది.

**పశ్చిమాసియా దేశాలకు ఎగుమతుల్లో వృద్ధి**

పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపలేదు. గత నెలలో పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి 5.7 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అయిన ఎగుమతులతో పోలిస్తే ఇది 8.62 శాతం అధికం. ప్రధానంగా పెట్రోలియం, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 67 శాతం అధికమయ్యాయని రాజేశ్ అగర్వాల్ తెలిపారు. యూఏఈకి 10 శాతం పెరుగగా, సౌదీ అరేబియాకు 2.73 శాతం తగ్గాయి.

**క్రూడాయిల్ ధరలు పెరుగడం వల్లనే..**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గత నెలలో బ్యారెల్ క్రూడాయిల్ ధరలు 72 డాలర్ల నుంచి 95 డాలర్లకు చేరుకోవడంతో భారత్ అధికంగా చెల్లించాల్సి వచ్చింది. దీంతో వాణిజ్యలోటు ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకోవడానికి యుద్ధమే కారణమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మొత్తం దిగుమతుల్లో క్రూడాయిల్ వాటా 24 శాతంగా ఉండటం ఇందుకు కారణం. ఇదే సమయంలో ఎగుమతులు కూడా భారీగా పుంజుకున్నాయి. జూన్ 2022 తర్వాత ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఎగుమతులు జరుగడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల్లో ఎగుమతులు 17 శాతం ఎగబాకి 173.78 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 19 శాతం అధికమై 292.38 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో వాణిజ్యలోటు 118.60 బిలియన్ డాలర్లు. ముడి పత్తి, పప్పుదినుసులు, ఎరువులు, బొగ్గు, కోక్, కెమికల్స్, ప్రాజెక్ట్ గూడ్స్, గోల్డ్, ఎలక్ట్రానిక్ వస్తువులను భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకున్నది. ఈ సందర్భంగా వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ..పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, సముద్రపు ఉత్పత్తుల ఎగుమతులు పెరుగడం శుభసూచకమన్నారు.

# ఎగుమతులు డీలా.. గల్ఫ్ సంక్షోభం దెబ్బకు 2-3% పడిపోవచ్చు



**భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య అంచనా**

లుథియానా, : దేశీయ వస్తూత్పత్తి ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 2-3 శాతం క్షీణించవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) అంచనా వేస్తున్నది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయంగా ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులు ఇందుకు కారణమని ఎఫ్ఐఈవో అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. గత నెల మార్చి ఎగుమతుల్లో 7-8 శాతం పతనం చూసే వీలుందన్నారు. ఈ నెల 15న కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ 2025-26కు సంబంధించి దేశీయ ఎగుమతి-దిగుమతి గణాంకాలను వెల్లడించనున్న నేపథ్యంలో ఎఫ్ఐఈవో అంచనాలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేయడంతో యుద్ధం మొదలైన విషయం తెలిసిందే.అప్పట్నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతుల్లో అంతరాయం కలుగుతున్నది. అంతేగాక నౌకలు, విమానాల్లో సరుకు రవాణా ఖర్చులు పెరుగడం, బీమా ఖరీదెక్కడం జరిగిపోయాయి. కీలకమైన హొర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేయడం.. సముద్ర రవాణాకు ఇబ్బందుల్ని తెచ్చిపెట్టింది. అలాగే అమెరికా-ఇజ్రాయెల్‌కు అండగా ఉంటున్నారని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులకు దిగడంతో ఆయా దేశాలు తమ గగనతలాలపై ఆంక్షల్ని తీసుకురావడం.. విమానాల్లో సరుకు రవాణా వ్యయాన్ని పెంచేసింది. ఇక దేశీయ ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా, మెజారిటీ వాటా సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రెయిన్ తదితర దేశాలదే. అయితే ఈ దేశాల్లోని ముడి చమురు, సహజ వాయువు ఉత్పాదక కేంద్రాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులను ప్రయోగిస్తుండటంతో ఉత్పత్తి ఆగిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగిపోయాయి. ఫలితంగా ఉక్కు, ప్లాస్టిక్, రబ్బర్ తదితర ముడి సరుకుల ధరలూ పెరిగాయని, ఇవన్నీ కూడా అంతిమంగా ఎగుమతుల్నే ప్రభావితం చేస్తున్నాయని రల్హాన్ వివరించారు. అయితే దేశీయ వస్తూత్పత్తి, సేవల ఎగుమతుల్ని కలిసి చూసినైట్టెతే గత ఆర్థిక సంవత్సరం 5-6 శాతం పెరుగుదల కనిపించవచ్చని చెప్పారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఎగుమతులు 825 బిలియన్ డాలర్లు (వస్తూత్పత్తి ఎగుమతులు 437 బిలియన్ డాలర్లు, సేవల ఎగుమతులు 388 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య 2 వారాల కాల్పుల విరమణ సంధితో నౌకల్లో సరుకు రవాణా తిరిగి ప్రారంభం కాగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా రల్హాన్ వ్యక్తం చేశారు. అయితే అధిక వడ్డీరేట్లు ఎగుమతిదారులకున్న రుణ లభ్యత అవకాశాలను దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం ఈ విషయంలో ఊరట కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.2024-25లో గల్ఫ్ దేశాలతో భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం 178 బిలియన్ డాలర్లు (రూ.16.55 లక్షల కోట్లు). ఎగుమతులు 56.87 బిలియన్ డాలర్లు, దిగుమతులు 121.67 బిలియన్ డాలర్లు. భారత్ నుంచి యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, బహ్రెయిన్, ఖతార్, కువైట్ (గల్ఫ్ రీజియన్) దేశాలకు సానబెట్టిన రత్నాలు, ఆభరణాలు, బియ్యం, ఔషధాలు ఎక్కువగా ఎగుమతి. గల్ఫ్ ఉద్రిక్తతల ఒత్తిడిలో భారతీయ పెట్రోలియం ఉత్పత్తులు, రసాయనాలు, ప్లాస్టిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయం, ఔషధ, రత్నాలు, ఆభరణాల ఇండస్ట్రీలు.

